# అల్లుని అతిశయము

**శ్రీమతి సుసర్ల లక్ష్మీనరసమాంబగారు**

మృష్టాన్నేష్వరుచి స్సదాసువసనే దర్పాదివానాదరః
సాంత్వోక్తావతినోక్తరోషయదిసుహృద్భావేపి సాసూయతా
ప్రాప్తేషూత్సవవాసరేషు చ పునర్జాయా ప్రయాణోద్యమ
స్సజ్జామాతృపదాంకితో నహినః లేకింనామదుశ్చేష్టితం॥

[మంచి ఆహారపదార్థములయందు రుచిలేనట్టు నటించుట; ఎల్లప్పుడు మంచివస్త్రము లిచ్చినను గర్వముతో వాని నాదరింపకుండుట; ఎవరు పలుకరించినను చిరాకుపడుట, ఎంత స్నేహముగా నున్నను అసూయను పొందుట, పండుగరోజులు వచ్చినపుడు భార్యతో కూడ ప్రయాణమగుట మొదలుగా అల్లుడనువాడు చేయునవన్నియు పాడుపనులై యున్నవి.]

(ప్రదేశము: ఏలూరు. ప్రవేశము: రామశాస్త్రి, పిచ్చమ్మ)

పి:—ఏమండో! 8కి గంటలబండి కూడా వెళ్లినట్లున్నది. అతగాడు రాలేదు. ఎందుచేతనోగదా!

రా:—ఒకవేళ రయిలుమించి యుండవచ్చును. రయిలుమించినప్పటికీ ఇక్కడికీ బెజవాడకీ మోటారులు తిరుగుచున్నవి గదా, దానిమీద వస్తాడేమో.

పి:—ఏలాగో యీరాత్రికి వచ్చినయెడల రేపు వినాయకవ్రతము నిర్విఘ్నముగా సంతోషముతో చేసుకోవచ్చు; ఈరోజు 10 గంటలవరకూచూచి మరల అబ్బాయిని పంపుతారాయేమిటి? రేపుఉదయం మెయిలులో దీసుకుచక్కా వస్తాడు.

రా:—వుండు, వుండు, యేదోబండి ఆగినట్లువున్నది. అదిగో, కోటీశ్వరరావే, ఏమే! కాళ్లుకడుగుకొనుటకు నీళ్లుపట్టుకురా.

అంతట యిరువదిసంవత్సరముల వయస్సుగలవాడు కంటికి అద్దములు, కాళ్లకుబూట్సు, చేతికివాచీ గల నవనాగరికలక్షణములతో అల్లుడు ప్రవేశించి 'వోరీ! పెట్టె అవీజాగ్రత్తగా ఇంట్లో పెట్టు' అన్నాడు బండివాడితో.

రా:—అంతా క్షేమమే, గదా?

కో:—ఆ. అంతాక్షామముగానే వుంది.

ఇంతలో అత్తగారు నీళ్లు చెంబునిండా పట్టుకొని రెండవచేతితో తువ్వాలు విసనకఱ్ఱతీసుకుని గబగబలాడుతూ వచ్చింది. వచ్చి 'మీఅమ్మగారు నాయనగారు అందరూసుఖులాపగనున్నారా?' అంది.

కో:—వుస్. మావాళ్లకు మీదయవల్ల యేజబ్బులురాలేదు.

పి:—(తనలో) ఇదేమిటిల్లా అంటాడు? (ప్రకాశముగ) స్నానంచెయ్యి. ప్రొద్దుపోకుండా భోజనం చేస్తువు గాని.

కో:—నాకు ఆకలిలేదు. ఇంటివద్ద ఫలాహారములు పుచ్చుకునివస్తిని.

పి:—ఆకలిలేకపోవడం యేమిటి పదకొండుగంటలైంది. నీవు వస్తావుగదా కలిసి భోజనంచెయ్యవచ్చునని మీమామగారు కూర్చున్నారు. ఆకలివేసినంతే భోజనంచెయ్యవచ్చును. లే, స్నానంచెయ్యి.

గా:—రావోయీ, రెండు మెతుకులుకొరుకుదువుగాని.

కోటీశ్వరరావు మాట్లాడకుండా లేచి తనపాటుకేసుతీసి తువ్వాలొకటి, సబ్బుబిళ్లొకటి తీసుకొని నేరుగా నూతివద్దకువెళ్లేడు.

పి:—మీరుకూడాలెండి. వేడినీళ్లు అల్లునికి మీకుకూడా తోడిపెట్టుతాను.

రా:—రా, త్వరగారా, అల్లుడుగారు చన్నీళ్లుస్నానం చేస్తున్నట్టున్నారు. వద్దని చెప్పు.

పిచ్చమ్మగారు గబగబనూతిదగ్గరకువెళ్లి 'వేడినీళ్లు, సబ్బు, సీకాయ అన్నీఉండగా చన్నీళ్లుస్నానం చేస్తున్నావేమిటి?' అంది.

కో:—వేడినీళ్లువద్దు. నాకు వేడిచేస్తుంది. చన్నీళ్లే అలవాటు.

పి:—ఇదిగో వేడినీళ్లుపోసుకో.

కోటీశ్వరరావు భార్య సావిత్రమ్మ యిదిఅంతాచూసి తనభర్తగారి బెట్టుసరికి లోలోన నవ్వుకొంది. అంతట అల్లుడుగారు మామగారు విస్తరిముందు కూర్చుని భోజనములకుపక్రమించినారు. అల్లునికి ఏమీ హితవు కాలేదు.

రా:—ఏమే, అల్లుడుగారు అన్నిపదార్థములు కొద్దిగ రుచిచూచుచున్నారు. నీవంట ఆయనకు సరిపోలేదేమో.

కో:—(కోపముగా) నాకుఆకలిలేదని యిదివరకే చెప్పితిని. మాయింట్లోయీరోజు మాఅమ్మ దోసెలు, పెసరట్లు, యిడ్డెన్లు అన్నీచేసింది. పైగానాకు అజీర్తిగావుంది.

ఇంతలో భావమరదివచ్చి 'మా భావగారికి అజీర్తిరోగంపట్టుకుందా? లేక అల్లునిరోగం పట్టుకుందా?' అన్నాడు. ఇంతలో సావిత్రమ్మవచ్చి 'ఆయన్నివేళాకోళంచెయ్యకండి' అంది.

రా:—ఏమోయీ, విశేషాలు ఏమిటి?

కో:—ఏమున్నాయి. రేపుఉదయమే మీఅమ్మాయి నేను ప్రయాణం.

పి:—ఇదేమిటి? రేపువినాయకచవితి. పూజచేసికొని రెల్లుండి తీసుక్కువెళ్లవచ్చును. చవితిపూట ప్రయాణమేమిటి?

రా:—అంతతొందరేమిటోయి. సరదాగా నాలుగురోజులుండి మరీ అమ్మాయిని తీసుకువెళ్లుతావను కున్నాను.

పి:—పిల్లా, నీవుచెంబుడునీళ్లుపోసుకుని కొత్తబట్టలుకట్టుకొని పూజచేసికొని నాలుగురోజులు సరదాగా వుండి మరీ వెళ్లండి. ఎన్నాళ్లనుండియో పిలవగా పిలవగా వచ్చేవు. చవితిపూట. రేపే ప్రయాణమేమిటి?

కో:—మీరుపెట్టే జరీపంచెలు, ఉప్పాడకండువాలు, బనారసుచీరలు అన్నీకొల్లబోతున్నాయా యేమిటి? వాటికోసం నేనాశపడ్డానా? నాకేవున్నాయి కావలసినన్ని పట్టుబట్టలు.

పి:—కోపగించకు, నాయనా! నాకు ఒక్కఆడపిల్ల. దానికి ఇంతపసుపు, కుంకుమ, చలిమిడి, చీరపెట్టకుండా ఎట్లాపంపను? పెద్దచీరలు పెట్టగల సామర్థ్యము లేకపోయినా యేదో శక్త్యానుసారము పెడతాము. చవితిపూట పంపడమంటే మాకేమి బాగుండలేదు. పోనీ రెల్లుండి తీసుక్కువెళ్లుతే బాగావుంటుంది.

కో:—మీఅమ్మాయికిపెడితే మీశక్త్యానుసారమే అమృతగుడ్డలుపెట్టుకోండి. నాకుఅక్కరలేదు.

రా:—నీవుయేదికావాలంటే అవ్వే పెడతానోయి. నీవుఖద్దరువద్దంటే కొనవేకొనను.

తిమ్మరాజు:—(ప్రవేశించి) భావగారూ! మీకొరకు రెవ్వరోవచ్చేరు. మాట్లాడాలట కూర్చొనివున్నారు.

కో:—నాకోసం రెవ్వరువచ్చేరు? నేను రెవ్వరితోనూ మాట్లాడను. నాతో పనివుంటే మాగ్రామం వచ్చి మాట్లాడమని చెప్పండి. వీలులేదు వెళ్లిపొమ్మనండి.

అల్లుడుగారిభోజనం మామగారిభోజనం అయింది. సావిత్రమ్మ తాంబూలపట్టుకుని వచ్చింది. కోటీశ్వర రావు నెమ్మదిగా తాంబూలం వేసుకుంటూ భార్యతో 'ప్రయాణమై సిద్ధంగావుండు. రేపే ప్రయాణం' అన్నాడు.

రా:—ఇదేమిటోయీ, వేళాకోళమువను అన్నావనుకుంటున్నాను. నిజమేనాయేమిటి? రేపు ఒక్క రోజూ ఆగండి. ఎల్లుండి తెల్లవారకుండానే వెళ్లుదువుగాని. ఎల్లుండివుండమనను లే.

కో:—ఇంక నాకు చెప్పకండి. దానియిష్టం. అదివస్తేవస్తుంది. లేకపోతేలేదు. నాప్రయాణం తప్పదు.

సావిత్రమ్మ మాట్లాడకుండా తల్లి దగ్గరకు వెళ్లింది. తానుకూడా రేపే ప్రయాణమని చెప్పింది. ఆమె కన్నుల నీరుబెట్టుకొనుచు వచ్చి "అబ్బాయీ! నామాట కొంచెంవిను. వచ్చారెన్నాళ్లకో. ఎన్నిసార్లుపిలచినా రానేరావు. వచ్చినప్పుడైనా నాలుగురోజు లుండకపోతే మాకేమిసంతోషంగా వుంటుంది? కాదూ కూడదూ అంటే యెల్లుండి తీసుక్కువెళ్లు. చవితిపూట రేపే ప్రయాణంబాగాలేదు. రేపు అబ్బాయితోకూడా పూజచేసుకోవాలి. తప్పదు. మరోమాటచెప్పక" అంది.

కో:—ఇదేమిసంత? నాకు బలవంతపుబ్రాహ్మణార్థమాయేమిటి? నేనువుండను. దాన్నికూడా పంపండి. లేకపోతే దానికీ, నాకూ నేటితోసరి.

సావిత్రి:—సరే! బాగానేవుంది. నామీద కోపమెందుకు? వాళ్లుపంపనన్నారా? నేను రానన్నానా? నాకు అడ్డమేముంది? సిద్ధంగావున్నాను.

తిమ్మరాజు:—భావగారూ! నాతోపూజచేసుకోరూ?

కో:—పూజాలేదు, గీజాలేదు. ఇవన్నీనాకు సరిపోవు. తెల్లవారకుండా రమ్మని బండి వానితో చెప్పిరా?

తిమ్మ:—తెల్లవారనీయండి. రాత్రిమాత్రం సుఖంగా నిద్రపోండి. మీతోకూడా పూజచేసుకోవాలని సరదాగావుంది. పోనీ పూజకాగానే బండికుదురుస్తాను. ఎల్లుండి తెల్లారకుండా మీరు వెళ్లేటట్టు రైలుకు పంపిస్తాను.

కో:—నాతో మాట్లాడకూ. నాకు ఒళ్లుమండుతుంది. నేనే కుదుర్చుకుంటాను బండి.

ఆరాత్రి అనవసరంగా కోపగించి అల్లుడు అన్నంతినలేదు. ఆయనతినలేదని భార్యతినలేదు. పిల్లతినలేదని తల్లి తినలేదు. కోటీశ్వరరావు తెల్లవారకుండాలేచి భార్యనులేపేడు. బండిని తానే వెళ్లి తీసుక్కువచ్చేడు. బండి యెక్కుమన్నాడు. ఎక్కనంటుందాయేమిటి? రామశాస్త్రి, పిచ్చమ్మ బ్రతిమాలుతూనేవున్నారు. 'చవితి యేమిటి? సింగినాదం' అని బండెక్కేడు. బండికదిలింది.

## పొలి పాట

(సంపాదకురాలు) శ్రీమతి ఇందుర్తి శకుంతలగారు

పొలి పొలిగలుగ
విఘ్నేశ్వరుండా! కుప్పతీపిళ్లు
పలకపాతళ్లు పొలుగాడెలు
తిరుమలకొండ ఘాటిగాటీరవలె
వేములకొండఘాటి హెచ్చవలె
పొలి పొలిగలుగ...

తూర్పునబోరన్న బల్లతేరన్న
పరమటాబోరన్న తూముతేరన్న.
చెడిపుల్లబడిపుల్ల బండిగావిస్తి
నల్లెద్దుపుల్లెద్దు బండికట్టిస్తి.
వేసిరేబీగాలు తీతెమిరేబండ్లు
గోవిందరాజులకు వొడ్లయ్యావొడ్లు.